

చంద్రబాబుకు గజమాలతో సత్కారం

చంద్రబాబుతో ఎంపీ రామ్మోహన్ నాయుడు, కూన రవికుమార్

ఆమదాలవలస సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, భారీగా హాజరైన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, ప్రజలు

నదుల అనుసంధానం నా కల

- అధికారంలోకి రాగానే ఈ పని చేస్తాం
- ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తాం
- జగన్.. ఉత్తరాంధ్రకు ఏం చేశావు?
- సైకో పాలనలో అంతటా విధ్వంసమే
- ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టండి
- వలసలు నివారిస్తాం.. ఉపాధి కల్పిస్తాం
- టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు
- పాతపట్నం, ఆమదాలవలసలో ప్రజాగళం సభలు విజయవంతం
- భారీగా తరలివచ్చిన జనం

శ్రీకాకుళం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి)

"ఒక్కచాన్స్‌తో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి.. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి.. వైఎస్ జగన్ చరిత్ర హీనుడుగా మిగిలిపోయాడు. ఎంతో మంది నిరుద్యోగులు ఉపాధి లేక రోడ్డున పడ్డారు. వైసీపీ పాలనలో వలసలు మరింత పెరిగాయి' అని టీడీపీ అధినేత నారా చంద్రబాబు ఆరోపించారు. పాతపట్నం, ఆమదాలవలసలో మంగళవారం నిర్వహించిన ప్రజాగళం సభల్లో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే వలసలు నివారిస్తామని.. ఉపాధి మార్గాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. నదుల అనుసంధానం తన కల అని.. వంశధార, బ్యారేజీ తదితర ప్రాజెక్టులను పూర్తిచేసి ప్రతి ఎకరాకూ సాగునీరందిస్తామని స్పష్టం చేశారు. ఈసారి ఎన్నికల్లో వైసీపీని తరిమి కొట్టి.. సైకోను సాగనంపాలని పిలుపునిచ్చారు. రెండుచోట్లా ప్రజాగళం సభలకు అపూర్వ స్పందన లభించింది. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో పాటు అధిక సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. ఎటు చూసినా జనమే జనం. గతంలో ఎన్నో దఫాలు జిల్లాకు వచ్చినా.. ఇంతటి జనాన్ని తాను ఎన్నడూ చూడలే దంటూ.. చంద్రబాబు మరింత ఉత్సాహంగా ప్రసంగించారు. మూడోసారి ఎంపీ రామ్మోహన్ నాయుడును, పాతపట్నం, ఆమదాలవలస ఎమ్మెల్యే అభ్యర్థులు మామిడి గోవిందరావు, కూన రవికుమార్‌ను గెలిపించాలని కోరారు. వైసీపీ పాలనలో సర్వనాశనమైన రాష్ట్రాన్ని బాగుచేసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వ తీరును, ఆ పార్టీ నేతల అక్రమాలను తూర్పారబట్టారు. తాము అధికారంలోకి వస్తే చేపట్టనున్న అభివృద్ధి పనులను, అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వెల్లడించారు ఇలా..

● 'జగన్.. ఉత్తరాంధ్రకు ఏం చేశావు? ఆఫ్‌షోర్ రిజర్వాయర్, మహేంద్రతనయ ప్రాజెక్టులను పూర్తిచేయలేదు. వంశధారకు రూపాయి కూడా ఖర్చుచేయ లేదు. వంశధార నాగావళి నదుల అనుసంధానం పూర్తిచేయలేదు. అది పూర్తిచేసి ఉంటే ఆమదాలవలస బాగుపడేది. ఉత్తరాంధ్రకు ఒక్క రోడ్డు వేశావా? ఒక్క పరిశ్రమ వచ్చిందా? ఒక్క కళాశాల వచ్చిందా? బటన్ నొక్కాను అని చెప్పుకుంటూ చాలా బొక్కావు. ప్రభుత్వ ఉద్యోగులు చాలా నష్టపోయారు. వారిని లిక్కర్ షాపుల్లో కాపలాపెట్టారు. బదిలీలు కూడా సక్రమంగా చేపట్టలేదు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

ప్రజలు కొట్టే దెబ్బకు సీతారాం పారిపోతాడు...

ఆమదాలవలస అదిరిపోయింది. ప్రజాగళానికి వచ్చే జనాన్ని చూసి కొండంత ధైర్యం లభించింది. ప్రజలు కొట్టే దెబ్బకు డమ్మాబుస్సుల సీతారాం ఒడిశాకు పారిపోతాడు. అయినా సరే వెతికి పట్టుకువస్తాం. సీఎం ఏం చెబితే అది చేసి అసెంబ్లీ గౌరవం మంటకలిపిన వ్యక్తి సీతారాం. నా రాజకీయ జీవితంతో ఇటువంటి దద్దమ్మను చూడలేదు. ఆమదాలవలసను మొత్తం ఊడ్చేశాడు. ఏ పని జరగాలన్నా.. ఆయన ఇంట్లోవారికి కూడా బంగారు కానుకలు సమర్పి స్తేనే.. ఆ ఇంటి దేవతలు కనికరిస్తారు. నాగావళి వంశధార నదుల్లో ఇసుక విశాఖకు తరలిపోతోంది. ఈ ఇసుక దొంగ తమ్మినేని. ఉద్యోగుల బదిలీల్లో రూ. లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు వసూలు చేశారు. నా దృష్టిలో పడినవారిని నేను విడిచి పెట్టను. ఇప్పుడు సైకో బస్సు వేసుకుని వస్తున్నా డు. ధైర్యం ఉంటే బస్సుయాత్ర వదిలి ఆమదాలవలసలో ప్రజల వద్దకు రావాలి" అంటూ సవాల్ చంద్రబాబు విసిరారు.



పాతపట్నం సభకు తరలివచ్చిన ఉమ్మడి పార్టీల శ్రేణులు, ప్రజలు



పాతపట్నం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు

మేం అధికారంలోకి వస్తే..

● 'రాష్ట్రంలో ఎక్కడ చూసినా శ్రీకాకుళం జిల్లావారే.. అందులో పాతపట్నం వాసులే ఎక్కువ మంది ఉంటున్నారు. వీళ్లందరూ వలసలు వెళ్లిపోతున్నారు. మేము అధికారంలోకి వస్తే వలసలు నివారిస్తాం. స్థానికంగా ఇంజనీరింగ్, మెడికల్, ఐటీ కళాశాలలు ఏర్పాటు చేసి.. విద్యార్థుల జీవితాలను బాగు చేస్తాం. వ్యవసాయానికి గిట్టుబాటు ధర కల్పిస్తాం. వ్యవసాయ అనుబంధ రంగాలను సైతం అభివృద్ధి చేస్తాం. అందరికీ ఉపాధి కల్పిస్తాం.

● ప్రజలపై పన్నుల బాదుడు లేకుండా చేస్తాం. భవిష్యత్‌లో కరెంట్ ఛార్జీలు పెంచం. చెత్త పన్ను రద్దుచేస్తాం. ఇంటిపన్నులు నియంత్రిస్తాం. నిత్యావసరాల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించి మిమ్మల్ని ఆదుకుంటాం. మద్యం ధరల నియంత్రణతోపాటు మీ ఆరోగ్యాన్ని కాపాడుతా. గంజాయిని పూర్తిగా నివారిస్తాం. రోడ్లకు మహర్దశ కల్పిస్తాం. అన్నక్యాంటీన్లు తెస్తాం.

● అధికారంలోకి వచ్చాక తొలిసంతకం డీఎస్సీపైనే. నిరుద్యోగులకు ఏడాదికి 4 లక్షలు చొప్పున ఉద్యోగాలిస్తాం. వలంటీర్లకు రూ.10వేలు చొప్పున వేతనం ఇస్తాం. ఆపై స్కిల్ డెవలప్‌మెంట్‌ద్వారా శిక్షణ ఇచ్చి రూ.లక్షలు సంపాదించుకునే అవకాశం కల్పిస్తాం. పెట్టుబడులు తెస్తాం. మీరు ఊహించని విధంగా అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటాం. ఆదాయాన్ని పెంచుతా.. ప్రజలకు ఆ ఆదాయాన్ని పంచుతా'నని చంద్రబాబు స్పష్టం చేశారు.

మహిళలతో చంద్రబాబు సమావేశానికి ఆంక్షలు..

● మంత్రి ధర్మాన ర్యాలీ ఉందని కారణం చూపిన పోలీసులు

శ్రీకాకుళం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో బుధవారం మహిళలతో నిర్వహించే సమావేశానికి వెళ్లేందుకు కుదరదని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడికి, నాయకులకు పోలీసులు ఆంక్షలు విధించారు. బుధవారం ఉదయం 11కు ఎన్టీఆర్ ఎంహెచ్ స్కూల్ మైదానంలో మహిళలతో సమావేశం ముందే ఖరారు అయింది. చంద్రబాబు టీడీపీ జిల్లా ఆఫీసు నుంచి ఉదయం 10.50 గంటలకు రోడ్డుమార్గంలో బయల్దేరతారు. అయితే బుధవారం ఉదయం రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు నామినేషన్ వేయనున్నారు. కార్యకర్తలతో కలసి ఏడురోడ్ల జంక్షన్ నుంచి ర్యాలీ చేసుకుంటూ 80 అడుగుల రోడ్డుమీదుగా వెళ్లి కలెక్టరేట్‌కు చేరుకుంటారు. అయితే ఈ రోడ్డులోనే టీడీపీ జిల్లా కార్యాలయం ఉంది. అదే రోడ్డు నుంచి చంద్రబాబు కాన్వాయ్‌ను విడిచిపెడితే.. లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తుతాయని.. రెండు గంటల ఆలస్యంగా టీడీపీ కార్యాలయం నుంచి చంద్రబాబు బయటకు రావాలని పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ విషయాన్ని మంగళవారం రాత్రి టీడీపీ జిల్లా ఆఫీసు వద్దకువెళ్లి చెప్పారు. దీంతో కలెక్టర్, ఎస్పీతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడారు. ఎట్టకేలకు టీడీపీ జిల్లా ఆఫీస్ నుంచి చంద్రబాబు కాన్వాయ్‌ను గంట తర్వాత అంటే.. 11.50 గంటలకు బయల్దేరాలని పోలీసులు స్పష్టం చేశారు.

రెడ్డిశాంతిది వసూళ్ల పర్వం

'పాతపట్నంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతిది వసూళ్ల పర్వం. ఆవిడది సివిల్ కాంట్రాక్టు బాధ్యత. ఇసుకలో డబ్బులు తరలించుకుంటున్నారు. ఒడిశాలో కూడా దందా సాగిస్తున్నారు. పాతపట్నం చరిత్ర తిరగరాసే బాధ్యత నాది. ఐటీడీఏ ఇక్కడ ఇస్తాం. మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, 100 పడకల ఆసుపత్రి, నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇస్తా'మని చంద్రబాబు తెలిపారు.



- ఎన్నికలకు ముందు హామీలిచ్చి మర్చిపోతారా?
- ఐదేళ్లలో ఏం చేశారని జిల్లాకు వస్తున్నారు?
- రోడ్ల దుస్థితి కూడా మార్చలేక పోయారుగా!
- జగన్ ప్రభుత్వంపై జిల్లా ప్రజల తీవ్ర అసంతృప్తి
- తామూ ఇంటికి పంపేందుకు సిద్ధమంటూ స్పష్టం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్ ఎన్నో హామీ లు గుప్పించారు. 'ఒక్కచాన్స్' ఇవ్వండి అంటూ అభ్యర్థించారు. జగన్ మాటలు నమ్మిన ప్రజలు 2019 ఎన్నికల్లో వైసీపీని గెలిపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ హామీలను విస్మరించారు. ముఖ్యమంత్రి హోదాలో ఇచ్చిన హామీలను సైతం సక్రమంగా నెరవేర్చలేదు. ఐదేళ్లు పూర్తయి.. ఇప్పుడు ఎన్నికలు సమీపించాయి. ఈ సారి 'సిద్ధం' పేరిట జగన్ ఓటర్ల దగ్గరకు వస్తున్నారు. మంగళవారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు. బుధవారం టెక్కలి లో 'సిద్ధం' సభ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కాగా.. ఈ ఐదేళ్లు ఏమి అభివృద్ధి చేశారని జిల్లాకు వస్తున్నారని సీఎం జగన్‌ను జిల్లా వాసులు ప్రశ్నిస్తున్నారు. వైసీపీని ఓడించేందుకు 'మేమూ సిద్ధమే'నని స్పష్టం చేస్తున్నారు.

● వంశధార ప్రాజెక్టు నిండాలంటే.. హిరమండలం రిజర్వాయర్ సద్వినియోగం కావాలంటే నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ వ్యవహారంలో ఒడిశా ప్రభుత్వం కొర్రీలు వేస్తూనే ఉంది. దీనిపై మూడేళ్ల కిందట సీఎం జగన్.. భువనేశ్వర్‌లో ఒడిశా సీఎం నవీన్‌పట్నాయక్‌ను కలిశారు. ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ప్రత్యామ్నాయంగా ఎత్తిపోతల పథకం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల ఈ పనులు ప్రారంభించగా.. ఎప్పటికి పూర్తవుతాయో తెలియని దుస్థితి. వంశధార ప్రాజెక్టు నుంచి సరఫరా అవుతున్న కాలువల లైనింగ్ సంగతే మరిచిపోయారు. కాలువల నిర్వహణకు పైసా కూడా విదల్చలేదు. గొట్టాబ్యారేజీ సంగతీ మరిచిపోయారు. లైనింగ్ అవసరమైన నిధులు మంజూరుచేయలేదు. వంశధార నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం ప్యాకేజీ ఇస్తామని ప్రకటించి.. కొంతమందికే పరిహారం అందజేశారు.

● ఈ ఏడాది మార్చిలో చేయూత, ఈబీసీ నేస్తం పథకాలకు సంబంధించి సీఎం జగన్ బటన్ నొక్కారు. కానీ ఇంతవరకూ లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమకాలేదు. దీంతో జగన్ తీరును వారంతా దుయ్య బడుతున్నారు. ఈ ఏడాది అమ్మఒడి పథకం కూడా అమలు చేయలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వైసీపీ పాలనపై అసంతృప్తితో ఉన్నారు.

● శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస ప్రధాన రహదారి గోతుల మయంగా మారింది. ఈ మార్గంలో గతుకులకారణంగా ఐదేళ్లలో సుమారు 25 మంది మృతి చెందారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాంలు ఈ రెండు నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నా.. కనీసం రోడ్డు బాగు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిని నాలుగు వరుసల రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ.18కోట్లు అదనంగా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ రోడ్డు పనులు పూర్తికాలేదు. ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రజలు విపరీతంగా విసిగిపోయి ఉన్నారు. ఈ ఒక్కరోడ్డే.. రేపటి ఎన్నికల్లో వైసీపీ నేతలను ఓడించే అవకాశముంది.

● 2022 జూన్ 27న శ్రీకాకుంలో కోడిరామ్మూర్తి స్టేడియం పూర్తిచేసేందుకు అదనంగా రూ.10 కోట్లు ఇస్తామని సీఎం జగన్ ప్రకటించారు. ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. దీనిపై మంత్రి ధర్మాన ప్రసాదరావు సైతం విమర్శలు ఎదుర్కొంటున్నారు.

● 2022 నవంబరు 23న నరసన్నపేట టౌన్ పరిధిలో ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్‌కు రూ.10 కోట్లు ఇస్తున్నట్లు సీఎం జగన్మోహనరెడ్డి ప్రకటించారు. ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఆదేరోజున మడపాం ఎత్తిపోతల పథకానికి కూడా రూ.15కోట్లు మంజూరు చేస్తున్నట్లు హామీఇచ్చినా.. వాటి ఊసే లేదు. నరసన్నపేటలో రాజుల చెరువు అభివృద్ధికి రూ.10కోట్లు ఇస్తున్నట్లు ప్రకటన కూడా అమలుకు నోచుకోలేదు. బొంతు ఎత్తిపోతల పథకం మిగులు పనులకు రూ.40కోట్లు ఇస్తామని ప్రకటించారు. ఆ పనుల్లో ఎటువంటి పురోగతి లేదు.

● 2019 సెప్టెంబరు 6న పలాసలో సీఎం జగన్.. తితలీ బాధితులకు రెట్టింపు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటికీ నెరవేరలేదు. సీఎం హామీలకే దిక్కు లేదంటూ ప్రజలు నిట్టూర్చుతున్నారు.



గోతులమయంగా శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారి

జిల్లాకు చేరుకున్న సీఎం జగన్

● నేడు టెక్కలిలో 'సిద్ధం' ముగింపు సభ

శ్రీకాకుళం,ఆంధ్రజ్యోతి/ రణస్థలం/ టెక్కలి, ఏప్రిల్ 23: ఎన్నికల నేపథ్యంలో మేమంతా సిద్ధం పేరిట బస్సుయాత్ర నిర్వహిస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి.. మంగళవారంరాత్రి జిల్లాకు చేరుకున్నారు. పైడిభీమవరం, కోష్ట, రణస్థలం తదితర ప్రధాన కేంద్రాల వద్ద ప్రజలకు అభివాదం చేసుకుంటూ బస్సుపై ముందుకుసాగారు. ఎచ్చెర్ల నియోజకవర్గం అరిణాం అక్కివలసలోని ఓ లేఅవుట్‌లో రాత్రి బస చేశారు. బుధవారం టెక్కలిలో సిద్ధం ముగింపు సభ నిర్వహిస్తారు. ఈ మేరకు సాయంత్రం 4 గంటలకు అక్కవరం జంక్షన్‌కు చేరుకుంటారు. 4.20గంటల నుంచి 5.20 వరకు బహిరంగ సభ నిర్వహిస్తారు. 5.30గంటలకు తిరిగి హెలీకాప్టర్‌లో బయ లుదేరుతారని సీఎం అడిషనల్ పీఎస్ కె.నాగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలి పారు. ఇదిలా ఉండగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, సీఎం జగన్ ఇద్దరూ జిల్లాలోనే మంగళవారం రాత్రి బస చేయడం, బుధవారం కార్యక్రమాలు నిర్వహించడం గమనార్హం.

● ఎన్నో సమస్యలు..

జిల్లాలో సమగ్ర కలెక్టరేట్‌ను పూర్తిచేయలేకపోయారు. పలాసలో రైలు నిలయం పక్కన వంతెనను పూర్తిచేయలేదు. కేంద్రం సహకారంలో చేపడుతున్న జల్‌జీవన్ మిషన్ పనులు సక్రమంగా సాగడం లేదు. ఉద్దానం తాగునీటి పథకం పనులు ఇంకా కొనసాగుతున్నాయి. టీడీపీ హయాంలో నిర్మించిన తాగునీటి పథకాలను మూలకు చేర్చించారు. అరసవల్లి శ్రీసూర్యభగవానుడి ఇంద్రపుష్కరిణిని అభివృద్ధి చేస్తామని చెప్పి అందులో ఉన్న నీటిని బయటకు తోడేశారు. ఇప్పుడు చుక్కనీరు కూడా లేదు. ప్రభుత్వ తీరుపై భక్తులు మండిపడుతున్నారు. ఉద్యోగసంఘాలు ఎదురుచూస్తున్న సీపీఎస్ గురించి.. ఇక్కడే మాటిచ్చినా ఆచరణకు నోచుకోలేదు. నిత్యావసరాలలో పంపిణీ చేయాల్సిన కందిపప్పు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. దీంతో అన్ని వర్గాల ప్రజలు వైసీపీ పాలనపై విసిగిపోయారు.

రైతుల పొలాలంటే అలుసా?




పొలం గట్టు తెగ్గొట్టడంతో ఆందోళనలో రైతులు

టెక్కలి, ఏప్రిల్ 23: టెక్కలి సమీపాన అక్కవరంలో బుధవారం సీఎం జగన్ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ నాయకులు అక్కవరంలోని వేదిక వద్ద ఉన్న పొలాల్లో గట్లను రైతులకు అడక్కుండానే మంగళవారం రాత్రి తొలగించారు. దీంతో రైతులు సంపతిరావు సతీష్‌కుమార్, ధవళ రంగారావు, గుంట రాజేష్, టి.మార్కండేయులు తదితరులు మండిపడ్డారు. బలవంతంగా పొలాలు చదునుచేసే అధికారం మీకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. పట్టణంలో అనేక మైదానాలు ఉండగా.. తమ పొలాల్లో సభ ఏర్పాటు చేయడం తగదన్నారు. సీఎం సభ పూర్తయిన తర్వాత.. పొలాల గట్లు పరిస్థితి ఏమిటని, దీని ఖర్చులు ఎవరు భరిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జన కేతనం




స్థానికేతరులదే హవా



పాతపట్నం నియోజకవర్గం

(మెళియాపుట్టి)



- మొదట కాంగ్రెస్.. తర్వాత టీడీపీ కంచుకోట
- విలక్షణ తీర్పు ఇస్తున్న ఓటర్లు
- ఈ ఎన్నికల్లో ఎవరికి పట్టం కడతారో?
- టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న మామిడి
- వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే శాంతి పోటీ
- అధికార పార్టీలో అంతర్గత విభేదాలు
- ఇదీ పాతపట్నం నియోజకవర్గ ముఖచిత్రం

ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలకు పూర్తిగా ఆనుకుని ఉన్న పాతపట్నం నియోజకవర్గానికి 72ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడి ప్రజలు ఆది నుంచి విలక్షణమైన తీర్పు ఇస్తున్నారు. స్థానికేతరులే ఎక్కువగా పోటీచేసి గెలుపొందుతున్నారు. దీంతో ప్రతీ ఎన్నికల్లో ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు ఇక్కడి నుంచి పోటీచేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. గొర్లె హరిబాబునాయుడు, లక్ష్మీపార్వతి, శత్రుచర్ల విజయరామరాజు, ప్రస్తుత ఎమ్మెల్యే రెడ్డి శాంతి వీరంతా స్థానికేతరులే. ప్రస్తుత ఎన్నికల్లో కూడా వైసీపీ తరఫున కొందరు స్థానికేతరులు టిక్కెట్‌ను ఆశించి భంగపడ్డారు. మొదట కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్నా, టీడీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీకి కంచుకోటగా మారింది. ఇప్పటి వరకు ఆరుసార్లు టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. ఈ ఎన్నికల్లో టీడీపీ నుంచి మామిడి గోవిందరావు, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కాంగ్రెస్ నుంచి కొవ్వవరపు వెంకట్రావ్ బరిలో నిలిచారు. అయితే, గోవిందరావు, శాంతి మధ్యనే ప్రధాన పోటీ.


మామిడి గోవిందరావు


కలమట వెంకటరమణమూర్తి


రెడ్డిశాంతి


కె.వెంకట్రావ్


కలమట మోహనరావు

పాతపట్నం నియోజకవరంలో ఎల్ఎన్‌పేట, కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టి, పాతపట్నం మండలాలు ఉన్నాయి. మొత్తం 2,24,648 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,12,588 మంది, 1,12,060 మహిళా ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో ఎక్కువగా తూర్పుకాపులు ఓటర్లు ఉన్నారు. దీంతో ప్రతి ఎన్నికల్లో ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకే పార్టీలు టికెట్లు కేటాయిస్తున్నాయి. కొత్తూరు, పాతపట్నం, హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల్లో అధికంగా కాపులు, మెళియాపుట్టిలో ఎస్టీలు ఎక్కువగా ఉన్నారు. కాపులే అభ్యర్థి గెలుపోటములను నిర్ణయిస్తున్నారు. ఈ ఎన్నికల కోసం 159 పంచాయతీల్లోని 539 గ్రామాల పరిధిలో 322 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు.

దూసుకుపోతున్న టీడీపీ అభ్యర్థి మామిడి..

టీడీపీ తరఫున ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కలమట వెంకటరమణమూర్తి తప్పించి మామిడి గోవిందరావుకు అధిష్ఠానం టిక్కెట్ ప్రకటించింది. ఈ పరిణామాలతో చెలరేగిన అసంతృప్తి ప్రస్తుతం కొంత సద్దుమణిగింది. వెంకట రమణమూర్తి ఇండిపెండెంట్‌గా బరిలో దిగే అవకాశం కనిపిస్తోంది. కాగా, స్థానికుడైన యువనేత, టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు ప్రచారంలో దూసుకుపోతున్నారు. అసంతృప్తులను బుజ్జగించి తనతో కలిసి వచ్చేలా చేయడంలో సక్సెస్ అయ్యారు. గతంలో టీడీపీ నుంచి వైసీపీలో చేరినా నేతలంతా తిరిగి సొంత గూటికి చేరుతున్నారు. పాతపట్నంలో టీడీపీ జెండాను ఎగరవేసేందుకు శాయశక్తుల పోరాడుతున్నారు.

సిట్టింగ్ ఎమ్మెల్యేపై తీవ్ర అసంతృప్తి..

వైసీపీని గత రెండు ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఆదరించారు. 2014లో వైసీపీ తరఫున కలమట వెంకటరమణమూర్తి పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత టీడీపీలో చేరారు. అప్పట్లో ఆయన కొంతమేర వంశధార నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంతోపాటు గిరిజన గ్రామాలకు రోడ్లు వేయించారు. 2019 ఎన్నికల్లో కూడా వైసీపీ అభ్యర్థి రెడ్డి శాంతి గెలుపొందారు. కాగా, సిట్టింగ్ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి ఐదు మండలాల కేడర్ నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. స్థానికేతర వ్యక్తయినా 2019లో ఆమె గెలుపునకు కేడర్ సమన్వయంతో పనిచేసింది. దీంతో రెడ్డి శాంతి టీడీపీ అభ్యర్థి కలమట వెంకటరమణమూర్తిపై 15,551 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో స్థానికసంస్థ ఎన్నికల నాటి నుంచే కేడర్‌కు, ఎమ్మెల్యేకు మధ్య దూరం పెరిగింది. ఆమె మొదటి మూడేళ్లు ప్రజలకు అందుబాటులో లేకుండా ఢిల్లీలో ఉండేవారని, ఒక వేళ పాతపట్నంలో ఉన్నా దొరికేవారు కాదని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికలు దగ్గరపడుతుండడంతో ప్రజల్లోకి వస్తున్నారు. ఎటువంటి పనులు చేయకపోవడంతో పాటు సమస్యలు పరిష్కరించలేదని పలుచోట్ల ప్రజలు ఆమెను నిలదీస్తున్నారు. ఈ ఎన్నికల్లో మళ్లీ రెడ్డి శాంతికే టికెట్ ఖరారు కావడంతో వైసీపీలో తీవ్ర అంతర్గత విభేదాలు ఏర్పడ్డాయి. అధిష్ఠానం సయోధ్యకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. కొంతకాలంగా ఆమెను వ్యతిరేకిస్తున్న వారంతా టీడీపీలో చేరిపోయారు. ఈ ప్రభావం వైసీపీ గెలుపుపై పడుతుందని ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి. సమన్వయం లేకపోవడంతో హిరమండలం జడ్పీటీసీ ఉప ఎన్నికలో ఎమ్మెల్యే కుమారుడు రెడ్డి శ్రవణ్ పోటీచేసి ఓడిపోయారని కొంతమంది నాయకులు చెబుతున్నారు.

ఐదేళ్లలో పరిష్కారానికి నోచుకోని సమస్యలు..

నియోజకవర్గంలో పలు కీలక సమస్యలకు ఈ ఐదేళ్లలో ఎటువంటి పరిష్కారం లభించలేదు. ప్రధానంగా వంశధార, ఆఫ్‌షోర్ నిర్వాసితులు సమస్యలు ఎక్కువగా వేధిస్తున్నాయి. ఈ సమస్యలపై హిరమండలం, మెళియాపుట్టి రైతులు పలుసార్లు రోడ్డెక్కిన ప్రయోజనం శూన్యం. వంశధార నదిపరివాహక ప్రాంతంలో కరకట్టలు పూర్తి చేయలేదు. ఏటా వర్షాకాలంలో కొత్తూరు మండలంలోని పలు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. 2007లో ప్రారంభించిన కరకట్టలపై వైసీపీ ప్రభుత్వం దృష్టిసారించలేకపోయింది. తాగునీరు, రోడ్ల సమస్యలు ప్రతి గ్రామంలోనూ వేధిస్తున్నాయి.

ఇవీ విశిష్టతలు..


● పాతపట్నం నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పట్లో ద్విసభ్య శాసనసభగా ఉండేది. లుకలాపు లక్ష్మణదాస్, వీవీ గిరి నుంచి రెడ్డి శాంతి వరకు 19 మంది ఎమ్మెల్యేలు పనిచేశారు. మొదట్లో కాంగ్రెస్‌కు పట్టకట్టేవారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీకి కంచుకోటగా మారింది. ● పాతపట్నం లోక్‌సభ స్థానం నుంచి 1951 నుంచి 1956 వరకు ఎంపీగా పని చేశారు. ఇక్కడి నుంచే రాజకీయ ఓనామాలు దిద్దిన వీవీ గిరి కేంద్ర కార్మిక మంత్రిగా పనిచేశారు. రాష్ట్రపతి పీఠాన్ని కూడా అధిష్ఠించారు. ● పాతపట్నం నుంచి గెలుపొందిన లుకలాపు లక్ష్మణ దాస్ జిల్లా రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా పనిచేసి 20 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీలో తిరుగులేని నేతగా వెలుగొందారు. ● 1994లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎన్టీఆర్ కృష్ణుడి వేషధారణలో ఉన్న కటౌట్‌తో ప్రచారం చేసి కలమట మోహనరావు గెలిచారు. ఈ ఎన్నిక చెల్లదని ఆయన ప్రత్యర్థి ధర్మాన నారాయణరావు కోర్టుకు వెళ్లారు. దీంతో ఎన్నిక చెల్లదని తీర్పు రావడంతో ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికలో లక్ష్మీపార్వతీ విజయం సాధించారు. ● పాతపట్నం నియోజకవర్గం మొదటి నుంచి మూడుసార్లు కొంతమేర అటూ ఇటుగా మారింది. 1952 లో ఏర్పాటు చేయగా, 1962లో కొంతభాగం కొత్తూరు నియోజక వర్గంలోకి వెళ్లింది. వీరఘట్టం, భామిని, పాతపట్నం మండలంలోని 16 పంచాయతీలు కలిసి కొత్తూరు నియోజకవర్గంగా ఏర్పడింది. మళ్లీ 2009లో జరిగిన పునర్విభజనతో పాతపట్నం, కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, మెళియాపుట్టి మండలాలను కలిపి పాతపట్నం నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు.

కలమట కోటకు బీటలు..

పాతపట్నంలో కొన్ని దశాబ్దాలుగా కలమట కుటుంబం హవా నడిచింది. 1978లో ఇండిపెండెంట్‌గా గెలిచిన కలమట మోహనరావు ఆ తర్వాత కొద్దికాలం కాంగ్రెస్‌లో ఉన్నారు. అనంతరం టీడీపీలో చేరి వరుసగా గెలుపొందుతూ వచ్చారు. దీంతో పాతపట్నం కలమట కుటుంబానికి కోటగా మారింది. అయితే 1994 ఎన్నికల్లో దేవుడి ఫొటో వినియోగించి ఎన్నికలు ప్రచారం చేశారని తనపై పోటీచేసిన ధర్మాన నారాయణరావు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ఆ ఎన్నిక చెల్లదని తీర్పువెలువడింది. దీంతో మోహనరావుకు ఆరేళ్లపాటు పోటీచేసే అవకాశం లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో జరిగిన ఉప ఎన్నికలో లక్ష్మీపార్వతి అన్నా టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత మళ్లీ కలమట హవా నడిచింది. 2009లో ఎన్నికలకు ముందు కలమట మోహనరావు పీఆర్పీలో చేరగా ఆయన వారసుడు కలమట వెంకటరమణమూర్తి మాత్రం టీడీపీలో ఉండిపోయారు. 2014 ఎన్నికల ముందు వెంకటరమణమూర్తి వైసీపీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచారు. రెండేళ్ల తర్వాత టీడీపీలో చేరారు. 2019లో వైసీపీ అభ్యర్థి రెడ్డిశాంతి చేతిలో ఓడిపోయారు. తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో టీడీపీ టికెట్ కలమటకు ఇవ్వకపోవడంతో వారి కోటకు బీటలు వారుతున్నాయని చర్చ జరుగుతోంది.

ఇప్పటి వరకు వీరే ఎమ్మెల్యే..

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	లుకలాపు లక్ష్మణదాస్	కాంగ్రెస్	డి.గోవిందరాజులు	సీపీఐ	8190
1955	లుకలాపు లక్ష్మణదాస్	కాంగ్రెస్	డి.గోవిందరాజులు	సీపీఐ	11,129
1962	లుకలాపు లక్ష్మణదాస్	కాంగ్రెస్	సంపతిరావు	ఇండిపెండెంట్	6811
1967	పి.గున్నయ్య	కాంగ్రెస్	ఎస్.రాజయ్య	ఇండిపెండెంట్	394
1972	చుక్కా పగడాలమ్మ	కాంగ్రెస్	ఎస్.రాజయ్య	ఇండిపెండెంట్	8086
1978	కె.మోహనరావు	ఇండిపెండెంట్	లుకలాపు లక్ష్మణదాస్	జనతా	824
1983	టీటీ నాయుడు	టీడీపీ	కె.మోహనరావు	కాంగ్రెస్	6341
1985	డి.నారాయణరావు	కాంగ్రెస్	ఎం.లోకనాథం	టీడీపీ	5574
1989	కె.మోహనరావ	టీడీపీ	ధర్మాన నారాయణరావు	కాంగ్రెస్	274
1994	కె.మోహనరావు	టీడీపీ	ధర్మాన నారాయణరావు	కాంగ్రెస్	11,539
1996	లక్ష్మీపార్వతి	టీడీపీ(ఎల్‌పీ)	కె.వేణమ్మ	టీడీపీ	14,148
1999	కె.మోహనరావు	టీడీపీ	గొర్లె హరిబాబు	కాంగ్రెస్	10,555
2004	కె.మోహనరావు	టీడీపీ	గొర్లె హరిబాబు	కాంగ్రెస్	2064
2009	విజయరామరాజు	కాంగ్రెస్	వెంకటరమణమూర్తి	టీడీపీ	20,970
2014	కె.వెంకటరమణమూర్తి	వైసీపీ	శత్రుచర్ల విజయరామరాజు	టీడీపీ	3865
2019	రెడ్డిశాంతి	వైసీపీ	కలమట వెంకటరమణమూర్తి	టీడీపీ	15,551


ధర్మాన నారాయణరావు


చుక్కా పగడాలమ్మ


వీవీ గిరి


లక్ష్మణదాస్

గతంలో 21 ఏళ్లకు ఓటు హక్కు

అవునా!



హిరమండలం: కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో ఏడు దశాబ్దాల్లో అనేక సంస్కరణలు తీసుకువచ్చింది. దేశంలో మొదటి సాధారణ ఎన్నికలు 1952లో ఎన్నికల కమిషనర్‌గా సుకుమార్‌సేన్ ఆధ్వర్యంలో జరిగియి. ఈ ఎన్నికల్లో 17.90 కోట్ల మంది ఓటర్లకు ఓటు హక్కువేసే అవకాశం కల్పించారు. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి 1985 వరకు ఓటుహక్కు కనీస వయసు 21 ఏళ్లుగా ఉండేది. రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి బాధ్యతలు స్వీకరించిన తర్వాత 1988లో 61వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఓటు హక్కు వయసును 18 ఏళ్లకు తగ్గించారు. ఎన్నికల నిర్వహణలో సమూల సంస్కరణలు అమలు చేసిన ఘనత 1990 దశకంలో ఎన్ని కల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టీఎన్ శేషన్‌కు దక్కుతుంది. 1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 55 పార్టీలు బరిలో నిలవగా 2014 నాటికి ఆ సంఖ్య 370కి చేరింది. ప్రస్తుతం బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వ హించే విధానం నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం)వినియోగించే విధానాన్ని అమలు చేస్తున్నారు. 2019 నుంచి జరుగుతున్న ఎన్నికల నుంచి ఓటు ఎవరికి వేశారో తెలుసుకునేందుకు ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయిల్ (వీవీ ప్యాట్) యంత్రాలను కూడా వినియోగిస్తున్నారు.

'బ్రాహ్మణతర్లా' నుంచి రెండుసార్లు ఎన్నికలు

పలాస రూరల్: మొదటిసారిగా దేశవ్యాప్తంగా 1952లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఆ సంవత్సరం పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాలతోపాటు బ్రాహ్మణతర్లాను కలిసి టెక్కలి నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. అనంతరం ఆంధ్ర రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాల దృష్ట్యా 1955లో నియోజకవర్గాల విభజన జరిగింది. ఆ సమయంలో టెక్కలి నుంచి బ్రాహ్మణతర్లాను వేరుచేసి దాన్ని నియోజకవర్గంగా మార్చారు. పలాస-కాశీబుగ్గతో పాటు చుట్టుపక్కల గ్రామాలను కలిపి బ్రాహ్మణతర్లా నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. తొలిసారిగా పలాసకు చెందిన నిచ్చెర్ల రాములు ఎమ్మె ల్యేగా కృషికార్‌లోక్ పార్టీ నుంచి ఎన్నికయ్యారు. 1962లో జరిగిన ఎన్నికల్లో బెండి లక్ష్మీనారాయణ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపుపొందారు. 1967లో జరిగిన కొన్ని అనూహ్య పరిణామాలతో బ్రాహ్మణతర్లా, కాశీబుగ్గను టెక్కలి నియోజకవర్గంలో, పలాసను సోంపేట నియోజకవర్గంలో కలిపారు. మళ్లీ 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా పలాస, మందస, వజ్రపుకొత్తూరు కలిసి పలాస నియోజకవర్గంగా ఏర్పాటయ్యింది. దీంతో బ్రాహ్మణతర్లా నాటి నియోజకవర్గంగా చరిత్రపుటల్లో నిలిచిపోయింది.

గత చరిత్ర


బ్రాహ్మణతర్లా గ్రామం

పోలింగ్ కేంద్రాలు మూడు రకాలు



గార: ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలను మూడు రకాలుగా విభజించారు. ఇందులో మొదటిది సాధారణ పోలింగ్ కేంద్రం. రెండోది సమస్యాత్మక, మూడోది అతి సున్నితమైన పోలింగ్ కేంద్రం. రాజకీయ పార్టీలు, తమ అనుచరులు, కార్యకర్తలు ఒకరిపై మరొకరు దూషించుకోవడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, రిగ్గింగ్, గొడవలు తదితర సమస్యలను దృష్టిలో పెట్టుకొని వీటిని విభజించారు. సాధారణ పోలింగ్ కేంద్రం కంటే అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రం వద్ద భద్రత ఎక్కువగా ఉంటుంది. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటారు. జిల్లా వ్యాప్తంగా 183 సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను పోలీసులు ఇప్పటికే గుర్తించి జియోట్యాగింగ్ చేసి ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేశారు. వీటి ఆధారంగా ఎన్నికల అధికారులు పర్యవేక్షిస్తారు.



అప్రమత్తం | తుపాకులు ఇచ్చేశారు!



శ్రీకాకుళం క్రైం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈసీ నిబంధనల ప్రకారం పోలీసులు అప్రమత్తమయ్యారు. తుపాకీ లైసెన్స్‌లు కలవారంతా ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకూ తమకు ఆ యుధాలను అందజేయాలంటూ పోలీసులు వారికి లేఖలు రాశారు. ఆమేరకు సంబంధిత వ్యక్తులు తుపాకులను పోలీసులకు అప్పగించేశారు. ఎప్పుడు సార్వత్రిక ఎన్నికలు జరిగినా... ఈ ప్రక్రియను పోలీసులు పూర్తి చేయడం ఆన వాయితీ. స్వీయ రక్షణ కోసం తుపాకీ కావాలంటూ కొందరు వ్యక్తులు పోలీసుశాఖ కు దరఖాస్తు చేస్తారు. పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి... ప్రవర్తన తదితర వాటిని స్థానిక పోలీసులతో పాటు, స్పెషల్ బ్రాంచ్ ద్వారా విచారణ చేపట్టి.. అర్హుడైతే తు పాకుల లైసెన్స్ ఇస్తారు. ఇలా లైసెన్సు జారీ చేసినప్పుడు...పోలీసులు కొన్ని షరతులు పెడతారు. తాము అడిగినప్పుడు... ప్రత్యేక సందర్భాల్లో తిరిగి తుపాకిని తమకు స్వాధీనపరచాలన్న నిబంధన విధిస్తారు. ఈ నిబంధన పత్రం మీద ఆ వ్యక్తి సంతకం చేస్తారు. జిల్లావ్యాప్తంగా 273 లైసెన్స్ తుపాకులు ఉన్నాయి. వీటిలో బ్యాంకు సెక్యూరిటీ గార్డులు, క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసుల వద్ద 74 ఉన్నాయి. వీటిని మినహాయించి.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వ్యక్తిగత భద్రత, వివిధ రకాల లైసెన్స్‌దారుల వద్ద ఉన్న 199 తుపాకులను పోలీసులకు డిపాజిట్ చేశారు. వీటిని ఎచ్చెర్లలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో భద్రపరిచారు.

జాతీయ పార్టీలకే ఈవీఎంలో తొలి ప్రాధాన్యం



నరసన్నపేట: ఈవీఎంలో తొలుత గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తారు. నామినేషన్ పత్రాల్లో తమ పేరు, ఇంటి పేరు నమోదు చేయడంలో ఒక్కొక్కరు ఒక్కో పద్ధతిని అవలంబిస్తారు. అందుకే నామినేషన్లతో పాటు ఈవీఎంలో అభ్యర్థి పేరు ఎలా ఉండాలని కోరుకుంటారో ప్రత్యేకంగా రాసి ఇవ్వాలని అధికారులు సూచిస్తారు. దాని ఆధారంగా ఈవీఎంలో సదరు అభ్యర్థికి చోటు కేటాయింపునకు చర్యలు తీసుకుంటారు. అభ్యర్థుల ప్రాధాన్యతా క్రమాన్ని నిర్ధారించేందుకు అధికారులకు ఇదే ఆధారం. అభ్యర్థుల ప్రాధాన్యత క్రమాన్ని నిర్ధారించేందుకు మొదట జాతీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తారు. వారిచ్చిన పేరులో మొదటి అక్షరాలను పరిశీలించి తెలుగు వర్ణమాలలోని అక్షరాలు, గుణింతాల ఆధారంగా వరుసక్రమాన్ని నిర్ధారిస్తారు. జాతీయ పార్టీల అభ్యర్థులను గుర్తించి వారికి వరుస నంబరు కేటాయించిన తర్వాత గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీ అభ్యర్థులను నమోదు చేస్తారు. ఒకటికన్నా ఎక్కువ రాష్ట్ర పార్టీల అభ్యర్థులు ఉంటే వారిచ్చిన పేరు వివరాల ఆధారంగా తెలుగు వర్ణమాలను అనుసరించి వరుసలో కేటాయిస్తారు.

నామినేషన్ వేసిన రవికుమార్ దంపతులు

ఆమదాలవలస: నియోజకవర్గ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థులుగా కూన రవికుమార్, ఆయన సతీమణి కూన ప్రమీల మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నవీన్‌కు అందించారు. అనంతరం ఆమదాలవలస పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆనెపు రామకృష్ణంనాయుడు, తమ్మినేని విద్యాసాగర్, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.


జేసీకి నామినేషన్ పత్రాలు అందిస్తున్న రవికుమార్

జంట ఎమ్మెల్యేలు

గుర్తింపు

- గౌతు శివాజీ, కింజరాపు ఎర్రన్నాయుడు



కాశీబుగ్గ: ఉమ్మడి రాష్ట్రంలో జంట ఎమ్మెల్యేలుగా కింజరాపు ఎర్రన్నాయుడు, గౌతు శివాజీ అరుదైన గుర్తింపు సాధించారు. ఎన్టీఆర్ పిలుపు మేరకు వారిద్దరూ టీడీపీలో చేరారు. 1983 ఎన్నికల్లో సోంపేట నుంచి శివాజీ, హరిశ్చంద్రపురం నుంచి ఎర్రన్నాయుడు పోటీచేసి విజయం సాధించారు. 1985లో కూడా అదే నియోజకవర్గాల నుంచి పోటీచేసి గెలుపొందారు. గౌతు శివాజీ గౌతు లచ్చన్న కుమారుడిగా రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటికే ఎర్రన్నాయుడు చిన్నాన్న కృష్ణమూర్తి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన ద్వారా టీడీపీలో టిక్కెట్ సాధించారు. అదే సమయంలో వీరితో పాటు జిల్లాలో కళా వెంకటరావు, తమ్మినేని సీతారాం టీడీపీలో రాజకీయ అరంగేట్రం చేశారు. అయితే వారిద్దరూ వివిధ సమీకరణల్లో భాగంగా మంత్రి పదవులు సైతం దక్కించుకున్నారు. ఈనేపథ్యంలో 1989 ఎన్నికల్లో గౌతు శివాజీ, ఎర్రన్నా యుడులకు ఎన్టీఆర్ టిక్కెట్లు ఇవ్వలేదు. సోంపేటలో న్యాయవాది వడిశ బాలకృష్ణ, హరిశ్చంద్రపురంలో కింజరాపు ప్రకాష్‌కు టీడీపీ టిక్కెట్లు దక్కాయి. దీంతో గౌతు శివాజీ, కింజరాపు ఎర్రన్నాయుడు ఇండిపెండెంట్లుగా పోటీచేయ డానికి సిద్ధమయ్యారు. ఆ ఎన్నికల్లో ఇద్దరికీ ఎన్నికల కమిషన్ ఏనుగు గుర్తు కేటాయించింది. ఇద్దరూ గెలిచినా, ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ ఓడిపోయింది. త్రిముఖ పోరులో టీడీపీ ఈ రెండు నియోజకవర్గాల్లో మూడో స్థానానికి పడిపోవడం విశేషం. దీంతో ఉమ్మడి రాష్ట్రంలో వీరిద్దరూ జంట ఎమ్మెల్యేలుగా గుర్తింపుపొందారు. 1989 నుంచి 1994 వరకూ కాంగ్రెస్ అనుబంధ సభ్యులుగా కొనసాగారు. 1994 ఎన్నికలు టీడీపీకి ప్రతిష్టాత్మకంగా మారడంతో దూరమైన నేతలు పార్టీలోకి రావాలని ఎన్టీఆర్ పిలుపునిచ్చారు. దీంతో శివాజీ, ఎర్రన్నాయుడు తిరిగి టీడీపీలో చేరారు. వీరిద్దరూ ఆ ఎన్నికల్లో టీడీపీ టిక్కెట్లు దక్కించుకున్నారు. ఆ ఎన్నికల్లో మంచి మెజార్టీతో విజయం సాధించారు. ఆ తర్వాత 1996 లోక్‌సభ ఎన్నికల్లో కింజరాపు ఎర్రంనాయుడు శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి పోటీచేసి విజయం సాధించారు. వరుసగా నాలుగుసార్లు గెలుపొందగా, 2009లో ఓడిపోయారు. ఆ మరుసటి సంవత్సరం రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. ఆయన వారసుడిగా రామ్మోహన్‌నాయుడు రాజకీయాల్లో రాణిస్తున్నారు. శివాజీ మాత్రం 2008 వరకూ కొనసాగిన సోంపేట నియోజకవర్గం నుంచి వరుసగా గెలుపొందారు. సోంపేట నియోజకవర్గం కనమరుగై 2009లో పలాస అవతరించడంతో అక్కడ నుంచి పోటీచేసి, ఓటమి చవిచూశారు. 2014 ఎన్నికల్లో రెండోసారి పోటీచేసి గెలిచారు. గత ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పు కున్నారు. కుమార్తె గౌతు శిరీషను రాజకీయ వారసురాలిగా ప్రకటించారు. దశాబ్దాలు దాటుతున్నా జంట ఎమ్మెల్యేలు అంటే మాత్రం గుర్తొచ్చేది గౌతు శివాజీ, ఎర్రన్నాయుడే.

వైసీపీ పాలనలో.. ఉత్తిపోతలే

- పూర్తికాని కళింగపట్నం ఎత్తిపోతల పనులు
- ఐదేళ్లుగా నిర్లక్ష్యం
- పట్టించుకోని మంత్రి ధర్మాన

కళింగపట్నం ఎత్తిపోతల పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. గార మండలంలోని బైరి కాలువ శివారులో 2,600 ఎకరాలకు నీరందించే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. చాలావరకు పనులు పూర్తయ్యాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కారు ఈ పథకాన్ని పట్టించుకోవడం మానేసింది. ఐదేళ్లుగా పనుల్లో పురోగతి లేకుండాపోయింది. మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి రైతులు తీసుకువెళ్లినా ఫలితం శూన్యం.

(గార)

కళింగపట్నం ఎత్తిపోతల పథకం కోసం 2018 ఫిబ్రవరి 24న ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, అప్పటి ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి గార వద్ద వంశధార నది ఒడ్డున భూమి పూజ చేశారు. ఏపీఎస్ఐడీసీ ఇంజనీర్ల పర్య వేక్షణలో నదిలో ఊటబావిని నిర్మించారు. విద్యుత్ స్తంభాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. మోటార్లను కూడా తెప్పించి ఉంచారు. నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న తూలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నుంచి గారలో ఏర్పాటు చేసిన ఈ ఎత్తిపోతల పథకం వరకు ప్రత్యేక విద్యుత్ లైన్లు కూడా పూర్తి చేశారు. వమరవెల్లి, కళింగపట్నం తదితర గ్రామాల్లో ఉన్న శివారు భూములకు పూర్తిస్థాయిలో నీరందించేందుకు రూ.2.75 కోట్ల స్పెషల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిధులతో చేపట్టిన ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే దశాబ్దాలుగా ఉన్న సాగు నీటి సమస్య తీరుతుందని ఆయకట్టు రైతులు ఆనంద పడ్డారు. అయితే ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకానికి సంబంధించిన మిగిలిన పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోలేదు. అర్థాంతరంగా నిలిచిపోయిన మిగిలిన పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకు రావాలని ఆయకట్టు పరిధిలో ఉన్న రైతులు, ప్రజా ప్రతినిధులు కలెక్టర్, మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి తీసుకువచ్చారు. అయినా పనులు పూర్తికి ఎలాంటి చర్యలు చేపట్ట లేదు. బిల్లులు చెల్లింపు జాప్యం కావడంతో పనులను కాంట్రాక్టరు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో వంశధార నదిలో ఏర్పాటు చేసిన ఊటబావి, ఒడ్డున ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, మోటార్లు ఎండకు ఎండి వర్షాలకు తడిచి పాడవుతున్నాయి.

అందుబాటులోకి తీసుకురావాలి



వేలాది ఎకరాల భూమికి సాగునీరందించే కళింగపట్నం ఎత్తిపోతల పథకం మిగిలిన పనులు పూర్తి చేయాలి. ప్రభుత్వం చర్యలు తీసుకుని ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి సాగునీటి సమస్య పరిష్కరించాలి.

- అట్టాడ కాశీబాబు, కొర్ని గ్రామం, గార


గార వద్ద వంశధార నదిలో ఏర్పాటుచేసిన ఊట బావి

గిరిజన ద్రోహి జగన్

- జిల్లాకు ఐటీడీఏ లేకుండా చేశారు
- నదుల్లో ఇసుక దోచుకున్నారు
- మరో 40 రోజుల్లో చంద్రబాబే సీఎం
- ఆ వెంటనే పాతపట్నంలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తాం
- షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం
- ప్రజాగళం సభలో ఎంపీ అభ్యర్థి రామ్మోహన్‌నాయుడు



పాత పట్నం/మెళియాపుట్టి/హిరమండలం/ ఆమదాలవలస, ఏప్రిల్ 23: గతంలో ఫ్యాన్‌కు ఓటు వేసి గెలిపించడంతో ఇక్కడ నదుల్లో ఇసుక లేకుండా చేశారని టీడీపీ శ్రీకాకుళం లోక్‌సభ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆరోపించారు. బుధవారం పాతపట్నం, ఆమదాలవలసలో జరిగిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. 'పాతపట్నం నియోజకవర్గం నుంచి వలసలు నివారించి ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. వంశధార నిర్వాసితులకు న్యాయం చేశాం. వంశధార ప్రాజెక్టు ఫేజ్-2.. 25శాతం పూర్తిచేశాం. అందరినీ జగన్మోహన్‌రెడ్డి మోసం చేశాడు. ఇక్కడ ఎమ్మెల్యేలను గాలికి వదిలేసి యాత్రలకు తిరుగుతున్నాడు. జగన్ గిరిజన ద్రోహి, జిల్లాకు ఐటీడీఏ లేకుండా చేశాడు. వంశధార నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం పరిహారం ఇస్తామని జగన్ హామీఇచ్చి మోసగించాడు. కీలకమైన ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు కూడా పూర్తిచేయ లేకపోయారు. అందరినీ ఆదుకునే చంద్రన్నను ఐదేళ్లపాటు ప్రజలు దూరం చేసుకోవడంతో ఉత్తరాంధ్ర కన్నీరుపెట్టింది. మరో నలభై రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌కు కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే. ఆ వెంటనే పాతపట్నం నియోజకవర్గంలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తాం. షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తాం. ఆమదాలవలసలో ప్రజలకు అందుబాటులో ఉండే కూన రవికుమార్‌ను, నన్ను గెలిపించాలి. పదేళ్లపాటు మన జిల్లా, రాష్ట్ర సమస్యలపైనా ఢిల్లీలో పోరాడాను. చంద్రబాబు సలహాలతో ఢిల్లీలో మన సంక్షేమం కోసం కష్టబడతాను.' అని రామ్మోహన్ తెలిపారు.

వైసీపీ నేతల కబ్జాలో పాతపట్నం: టీడీపీ అభ్యర్థి గోవిందరావు



పాతపట్నం నియోజకవర్గంలో విలువైన ప్రభుత్వ స్థలాలను వైసీపీ నాయకులు కబ్జా చేశారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు ఆరోపించారు. పాతపట్నం సభలో ఆయన మా ట్లాడుతూ.. 175 నియోజకవర్గాల్లో పాతపట్నం వెనుకబ డిన నియోజకవర్గమని చెప్పారు. 'విద్య, వైద్య వంటి మౌలిక వసతులు కూడా లేవు. ఐటీఐ, డిప్లమో కళాశాల లేదు. నిరుద్యోగం తీవ్రంగా ఉంది. ఇక్కడ ఏవిధమైన వనరులు లేవు. ప్రజలు అధికంగా వలసలు పోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొత్తూరుకు ప్రభుత్వానుపత్రి మంజూరైతే దాన్ని స్థానిక ఎమ్మెల్యే రెడ్డిశాంతి ఆమె కన్నఊరుకు తరలించారు. వైసీపీ పాలనలో నియోజకవర్గం 20 ఏళ్ల వెనక్కు వెళ్లిపోయింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇక్కడ పరిశ్రమలు, మహిళా కళాశాల, అగ్నిమా పక కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తా'నని తెలిపారు.

అరాచక సీఎంపై యుద్ధం: ఆమదాలవలస టీడీపీ అభ్యర్థి కూన



అరాచక సీఎం జగన్‌రెడ్డిపై యుద్ధం ప్రకటించాలని ఆమదాలవలస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కూనరవికుమార్ పిలుపునిచ్చారు. ఆమదాలవలస సభలో ఆయన మాట్లాడుతూ.. మే 13న జరిగే ఎన్నికల పోలింగ్ రాష్ట్రాభివృద్ధి కోసమా.. వినాశనం కోసమా అన్నది ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలన్నారు. 'తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ. లక్షల కోట్లను దోచుకుని 16 మాసాలు జైలుకువెళ్లి ఆ తర్వాత శవాలపై రాజకీయాలు చేసిన వ్యక్తి జగన్‌రెడ్డి. ఇటువంటి వ్యక్తి రాష్ట్రానికి అవసరమా? లేక ప్రజల సంక్షేమం కోసం కృషిచేసే చంద్రన్న కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలి. 2019లో ఆమదాలవలసలో ఓ డమాబుస్సుకు ఓటేశారు. ఆయన ఏ ఊరికైనా సాగు నీరిచ్చారా?. నదుల అనుసంధానం పూర్తిచేశారా?. ఇంటింటికీ నీరిచ్చారా?. ప్రజలు ఆలోచించాలి. ఈ ఐదేళ్లలో ఆ డమ్మాబుస్సు అభివృద్ధి చెందాడు కానీ.. ఆమదాలవలస అభివృద్ధి చెందలేదు. వంతెనకు ఆవల పెట్రోల్ బంకు, ఇవతల ఆరంతస్తుల భవనం నిర్మించారు. సీతారాం అభివృద్ధి చెందితే ఆమదాలవలస అభివృద్ధి చెందినట్లు కాదు. శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డును ఈ ఐదేళ్లలో వేయలేకపోయారు. ఆనాడు చంద్రన్న నాయకత్వంలో నదులు అనుసంధా నానికి చర్యలు తీసుకున్నాం. వైసీపీ వచ్చిన తర్వాత వాటిని పక్కన పెట్టేసింది. మరోసారి వైసీపీకి చాన్స్ ఇవ్వొద్దు. ఎన్డీఏ కూటమికి ఓటు వేయాలని' రవికుమార్ కోరారు.


ఆమదాలవలసలో రోడ్ షో నిర్వహిస్తున్న చంద్రబాబు



పాతపట్నంలో ప్లకార్డులతో మహిళలు





చంద్రబాబుతో బగ్గు రమణమూర్తి, గొండు శంకర్



టీడీపీ జెండాలతో అభిమాని


పాతపట్నంలో టీడీపీ శ్రేణుల సందడి

రోడ్లన్నీ పసుపు మయం



పాతపట్నంలో మంగళవారం జరిగిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రజాగళం సభకు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి భారీగా శ్రేణులు తరలివచ్చారు. దీంతో పాతపట్నం జనసంద్రాన్ని తలపించింది. రోడ్లన్నీ పసుపుమయమయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు పాతపట్నంలోని పెట్రోల్‌బంక్ ఎదురుగా ఉన్న హెలీప్యాడ్ వద్ద చంద్రబాబు దిగారు. హెలీప్యాడ్ నుంచి ప్రజాగళం సభా ప్రాంగణానికి వెళ్లే సమయంలో చంద్రబాబుకు దారిపొడుగునా ప్రజలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపిస్తూ, నృత్యాలు, కరచాలనం చేస్తూ విజయ సంకేతాలిస్తూ అభివాదాలతో స్వాగతం పలికారు. ఆమదాలవలస సభలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. చంద్రబాబును కలిసేందుకు జిల్లా టీడీపీ యంత్రాంగం హెలీప్యాడ్ వద్దకు వచ్చింది. ఎంపీ రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం అభ్యర్థి గొండు శంకర్, నరసన్నపేట అభ్యర్థి బగ్గు రమణమూర్తి, ఆయన కుమార్తెతో సహా చంద్రబాబును కలిశారు. పాతపట్నం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు, బీజేపీ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు, జనసేన కన్వీనర్ పేడాడ రామ్మోహన్‌రావు, మాజీమున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, మాజీఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, జిల్లా తెలుగుమహిళా అధ్యక్షురాలు మెట్ట సుజాత, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ, జిల్లా జనసేన అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ టీడీపీ నాయకుడు డోల జగన్, జనసేన పాతపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి గేదెల చైతన్య తదితరులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సలాన శరత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుని కలిసిన కలమట

- ప్రభుత్వమొస్తే సముచితస్థానం ఇస్తామని హామీ


చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, పక్కన అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చంద్రబాబును పాతపట్నం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మంగళవారం రాత్రి కలిశారు. పాతపట్నం టీడీపీ టిక్కెట్ కలమటకు దక్కకపోవడంపై ఆయన అసంతృప్తితో ఉన్నారు. ఆయన్ను చంద్రబాబు వద్దకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కొద్దిసేపు చర్చించారు. ప్రభుత్వమొస్తే.. కచ్చితంగా సముచిత స్థానం కల్పిస్తానని హామీఇచ్చారు. కూటమి అభ్యర్థుల గెలుపుకోసం కలిసి పనిచేయాలని సూచించారు. కలమట కుమారుడు సాగర్‌కు కూడా రాజకీయంగా ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు. దీంతో అసంతృప్తికి ఫుల్‌స్టాప్ పడింది. వీరితో శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు కూడా ఉన్నారు.



తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

కలెక్టరేట్: జిల్లాలో ప్రస్తుత వేసవికాలంలో తాగునీటి సరఫరాలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రతిష్టమైన ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. రాష్ట్ర సెక్రటేరియట్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గ్రామీణ ఉపాధి హామీ పథకం, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో రానున్న రోజుల్లో వేడిగాలులు ఎక్కువగా వీస్తాయని అందుకు తగిన విధంగా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఉపాధి పనుల్లో నీటి సంరక్షణ, చెరువుల డీసిల్టింగ్ తదితర పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యుత్తు సరఫరాలో ఎటువంటి ఆటంకాలు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అంతకు ముందు ఆయన గొట్టా బ్యారేజి నీటి నిల్వలపై వంశధార అధికారులతో చర్చించారు. సమావేశంలో జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, ట్రాన్స్‌కో ఈఈ ఎల్‌సీహెచ్ పాత్రుడు, డీపీవో వేంకటేశ్వర్లు, డ్వామా పీడీ చిట్టిరాజు, వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు, కార్పొరేషన్ ఈఈ పొగిరి సుగుణాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జాన్ బెన్‌హర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

నేడు జిల్లాలో తీవ్ర వడగాల్పులు

● అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

అరసవల్లి: జిల్లాలోని 13 మండలాల్లో బుధవారం తీవ్ర వడగాల్పులు, 16 మండలాల్లో వేడి గాలులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఆమదాలవలస, బూర్జ, జి.సిగడాం, పొందూరు, సరుబుజ్జిలి, నరసన్నపేట, జలు మూరు, టెక్కలి, కోటబొమ్మాళి, సారవకోట, పాతపట్నం, హిర మండలం, లక్ష్మీనర్సుపేట మండలాల్లో తీవ్ర వడ గాల్పుల ప్రభావం ఉంటుందన్నారు. మంగళవారం జిల్లాలో సారవకోట మండలంలో అత్యధికంగా 43.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైందని, అలాగే 20 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 7 మండలాల్లో వేడి గాలులు వీచాయన్నారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లావేరు: పైడాయవలసకు చెందిన పీరుకట్ల గొల్లారావు (32) సోమవారం రాత్రి పురుగుల మందు సేవించి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గొల్లారావు మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవలు పడేవాడు. సోమవారం కూడా గొడవ పడి మన స్థాపానికి గురై పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య రేణుకతో పాటు మూడేళ్ల లోపు వయసున్న ఇద్దరు కుమారులున్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామి నాయుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలు

లావేరు: సుభద్రాపురం జంక్షన్ వద్ద హైవేపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విజయనగరం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న వ్యాన్ సుభద్రాపురం వద్దకు చేరే సరికి ముందున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న యు.స్వర్ణలత, పద్మావతి, భ్రమరాంబ, సాయి ప్రవల్లికతో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరంతా ఎచ్చెర్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సిబ్బందిగా పని చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామినాయుడు తెలిపారు.

ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు: బగ్గు

నరసన్నపేట/జలుమూరు: ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ రాష్ట్రాన్ని ఐదేళ్లలో సర్వనాశనం చేశారని ఉమ్మడి పార్టీల అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం నరసన్నపేట నియోజకవర్గంలోని కోమర్తి, లకిమేర, సోమవారంపేట, కొండపోలవలస గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కలిగించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, బసవన్న చెరువు అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగాయన్నారు. జగన్నాటకాలకు చమరగీతం పలికి రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రభుత్వానికి మద్దతివ్వాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, వెలమల రాజేంద్రనాయుడు, నేతలు శిమ్మ జగన్నాథం, జల్లు చంద్రమౌళి, బగ్గు గోవిందరావు, బగ్గు సుగుణమ్మ, మెండ రాంబాబు, గురుబెల్లి ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.


జలుమూరు: కొండపోలవలసలో ప్రచారం చేస్తున్న బగ్గు రమణమూర్తి

టీడీపీలోకి 110 మత్స్యకార కుటుంబాలు చేరిక

గార: మత్స్యకార గ్రామమైన బందరువానిపేట అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. మంగళవారం గ్రామంలో ఎంపీటీసీ సభ్యులు బర్రి భూలక్ష్మి, సొసైటీ ప్రెసిడెంట్ దుమ్ము లక్ష్మయ్యతో పాటు 110 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి శంకర్ కండువాలు వేసి ఆహ్వానించారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య, జెట్టీ, శ్మశాన వాటిక షెడ్ తదితర నిర్మాణాలకు కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పీస వెంకటరమణమూర్తి, బడగల వేంకట్, గుండ భాస్కరరావు, పి.కృష్ణమూర్తి, కె.రాజు, మళ్ల అబ్బాయి నాయుడు తదితరులు పాల్గొన్నారు. ● **అరసవల్లి:** శ్రీకాకుళం గ్రామీణ మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరులైన వంద కుటుంబాలు ఆ పార్టీ నాయకులు నక్క రాము, బొట్ట కామరాజు ఆధ్వర్యంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఆయన కండువాలు వేసి ఆహ్వానించారు. అలాగే గార మండలం వాడాడ పంచాయతీ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో విశాఖ ఎ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీలో చేరాయి. నక్క సురేష్, మోహన్, శిమ్మ శ్యామలరావుతో పాటు శంకర్ సమక్షంలో పార్టీలో చేరగా శంకర్ కండువాలు కప్పారు. కార్యక్రమంలో గొలివి కరుణాకర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గార: టీడీపీలో చేరిన మత్స్యకారులతో గొండు శంకర్

సైకోను తరిమికొట్టి సైకిల్‌ను గెలిపించండి: శిరీష

పలాసరూరల్/వజ్రపుకొత్తూరు: సైకోను తరిమికొట్టి సైకిల్ పాలనను తీసుకురావాలని ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. పలాస మండలం బ్రాహ్మణతర్లా, సాయినగర్, చిన మామిడిమెట్టు, కొబ్బరిచెట్లపూరు, చినగురుదాసుపురం, సున్నాదేవి తదితర గ్రామాల్లో మంగళవారం పర్యటించి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ఎంపీగా కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుత్తుమ లక్ష్మణ్‌కుమార్, పీరికట్ల విఠల్, వజ్జ బాబూరావు, కుత్తుమ లక్ష్మణకుమార్ పాల్గొన్నారు. వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవులో జరుగుతున్న శ్రీరామనవమి వేడుకల్లో గౌతు శిరీష పాల్గొన్నారు. నువ్వలరేవులో బృందావతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పుచ్చ ఈశ్వరరావు, కదంబాల వెంకటరమణ, దువ్వాడ జయరాం పాల్గొన్నారు.


పలాస రూరల్: బ్రాహ్మణతర్లాలో ప్రచారం నిర్వహిస్తున్న గౌతు శిరీష

అన్నా మీ వెంటే మేమంతా..

రణస్థలం: అన్నా నీ వెంటే మేమంతా.. నిన్నే గెలిపించుకుంటాం.. కమలం, సైకిల్ గుర్తులపై ఓటు వేస్తామని తిరుపతిపాలెం గ్రామానికి చెందిన మహిళలు ఎన్డీఏ ఎచ్చెర్ల అసెంబ్లీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావుకు మహిళలు భరోసా ఇచ్చారు. మంగళవారం ఆత్మీయ కలయికలో భాగంగా తిరుపతిపాలెం గ్రామానికి సమీపంలో చెరువు పనులు చేస్తున్న మహిళలను ఆయన కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. మా గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశావు.. ఓటు వేసి రుణం తీర్చుకుంటామన్నారు. మహిళలను అన్ని విధాలా ఆదుకుంటానని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని ఎన్ఈఆర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల రవికుమార్, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు. ● **కవిటి:** రాష్ట్రంలో కూటమి విజయంతోనే సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే అశోక్ సతీ మణి నీలోత్పల అన్నారు. నెలవంక, బెజ్జిపుట్టుగ పంచాయతీల్లో పర్యటించి సూపర్ సిక్స్ పథకాలను ఉపాధి వేతనదారులకు వివరించారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు పి.కృష్ణారావు, హరికృష్ణ బిసాయి, బి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు. ● **అరసవల్లి:** సీఎం జగన్ నిరంకుశ పాలనే వైసీపీ పతనానికి కారణమని ఎంపీ రామ్మోహన్‌నాయుడు సతీమణి శ్రీ శ్రావ్య, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సతీమణి గొండు స్వాతి అన్నారు. మంగళవారం నగరంలోని రాజీవ్‌నగర్, విశాఖ-ఎ కాలనీల్లో ప్రజాగళం లో పాల్గొని సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించి ఎన్డీఏను గెలిపించాలని కోరారు. డాక్టర్ గొండు హరిత, ముద్దాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మహిళలతో ఎన్ఈఆర్

ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించాలి

సంతబొమ్మాళి: ప్రతి విద్యార్థి ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించాలని దండుగోపాలపురం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కోత చైతన్య అన్నారు. మంగళవారం పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే అశోక్ నామినేషన్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గ ఉమ్మడి పార్టీల అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్ బుధవారం నామినేషన్ వేయనున్నారని టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మా రావు, నందికి జాని ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీల క్యాడర్ వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

బాల్యవివాహాల వల్ల అనర్థాలు

టెక్కలి: బాల్యవివాహాలు చేయడం వల్ల అనర్థాలు చోటు చేసుకుంటాయని లింగాలవలస పీహెచ్‌సీ వైద్యులు సాయితేజ, భాగ్యశ్రీ అన్నారు. మంగళవారం ఆదీఆంధ్రా వీధిలో గ్రామస్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సీడీపీవో శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి పుష్పాంజలి


పుష్పాంజలి నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి, ఏప్రిల్ 23: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి వార్షిక కల్యాణోత్స వాల్లో భాగంగా చైత్రశుద్ధ పౌర్ణమి మంగళవారం ఉదయం స్వామికి సుమంగళి అర్చన, నీల మణిధారణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి కల్యాణ మూర్తులను ఊరేగింపుగా తీసుకువెళ్లి ఇంద్ర పుష్కరిణి వద్ద చక్రతీర్థ స్నానం చేయించారు. అనంతరం తిరువీధి నిర్వహించి తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. సాయంత్రం అనివెట్టి మండలంలో స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పుష్పాంజలి, విశేష పూజలు చేశారు. ప్రముఖ సంగీత కళాకారుడు బండారు చిట్టిబాబు ఆధ్వర్యంలో సంగీత కచేరీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో ఎస్.చంద్రశేఖర్, సిబ్బంది బీఎస్ చక్రవర్తి, కృష్ణమాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పురాతనమైన కోదండ రామాలయంలో వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో విశేషార్చనలు, మంగళసూత్రధారణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం ఉపనిషన్మందిరం సంస్థ ఆధ్వర్యంలో రామదర్బార్ నిర్వహించారు. పలువురు వేద పండితులు, సాహితీ వేత్తలు స్వామిని కీర్తించారు.

దేవీ ఆశ్రమంలో పౌర్ణమి పూజలు

ఎచ్చెర్ల: కుంచాల కురమయ్య పేటలోని దేవీ ఆశ్రమంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కర శర్మ రాజరాజేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులతో శ్రీ చక్రాల వద్ద పూజలు చేయించారు.



సూర్యుడి భగ భగ

● వేసవి తాపంతో అల్లాడిన ప్రజలు, మూగజీవులు


నరసన్నపేట: నిర్మానుష్యంగా ఉన్న మెయిన్ రోడ్డు

నరసన్నపేట/గార: సూర్యుడి భగభగలతో ప్రజలతో పాటు మూగజీవులు అల్లాడు తున్నాయి. మంగళవారం ఉదయం 8 గంటల నుంచే జిల్లాలో భానుడి ఉగ్రరూపం కనిపించింది. మధ్యాహ్నం 12 గంటలకే ప్రధాన మార్గాలు నిర్మానుష్యంగా మారడంతో పాటు ప్రజలు ఎండ వేడిమికి తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. పగటి ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకు చేరడంతో వేడి గాలులు వీచాయి. పాఠశాలల విద్యా సంవత్సరం చివరి రోజు కావడంతో ఎండలో ఇళ్లకు వచ్చేందుకు విద్యార్థులు అవస్థలు పడ్డారు. వేసవితాపం తీర్చుకునేందుకు చల్లని నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, తాటి ముంజులకు గిరాకీ పెరిగింది. ఇదిలా ఉండగా ఎండ తీవ్రతకు అల్లాడిన మూగజీవాలు ఎక్కడ చెట్లు ఉంటే వాటి కింద చేరి సేద తీర్చుకోవడం కనిపించింది.


గార: చెట్ల కింద సేద తీరుతున్న గొర్రెలు, మేకలు

ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు


మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ పున్నయ్య

కాశీబుగ్గ: ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మజ్జి పున్నయ్య అన్నారు. కాశీబుగ్గ గాంధీనగర్ ఎస్‌బీఎస్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. 584 మార్కులు సాధించిన వలిరెడ్డి దేవీశ్రీ వరప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో దట్టి ఉమాపతి, శ్రీనివాస బాబ్జీ, కొత్తపల్లి రమేష్, కరస్పాండెంట్ వెంకటరావు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘన

టెక్కలి: సీఎం జగన్ బుధవారం సిద్ధం ముగింపు సభకు టెక్కలి సమీపంలోని అక్కవరం రానుండడంతో వైసీపీ నాయకులు కొందరు బరితెగించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. హైవేకి సమీపంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. కోడ్ ఉల్లంఘించి మరీ ఫ్లెక్సీలు కడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.



డిగ్రీలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

పలాస: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, జువాలజీ, ఆక్వాకల్చర్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. కళాశాలలో చదివే విద్యార్థులకు జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాల పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

ఇంటర్‌లో ప్రవేశానికి..

మెళియాపుట్టి: పెద్దమడి గురుకుల కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.మధుసూదన రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 40 సీట్లు చొప్పున ఖాళీలున్నాయన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు బుధవారం నుంచి వచ్చే నెల15వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు కళాశాల వేళల్లో సంప్రదించాలన్నారు.

ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభం

జలుమూరు: తమ్మయ్యపేట కాలనీలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ మంది ర ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా మంగళవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం వేదపండితులు అక్కాజోష్యుల రమేష్‌శర్మ ఆధ్వర్యంలో రుత్విక్‌లు గణపతి పూజ, పుణ్యాహవచనం, పరిషత్, పంచగవ్య ప్రాశన, రుత్విక్ వరుణ, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, అంకురార్పణ తదితర కార్యక్రమాలు ప్రారంభించారు. బుధవారం ఉదయం అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ చేసి మధ్యాహ్నం అన్నసంతర్పణ చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు కొత్తమ్మ తల్లికి ఎంపీ పూజలు

టెక్కలి: ఎన్డీఏ ఎంపీ అభ్యర్థిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు బుధవారం నామినేషన్ వేస్తున్న నేపథ్యంలో ఉదయం 7.30 గంటలకు కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు శ్రీకాకుళం వెళ్లనున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్ కోరారు.

యముని విగ్రహాన్ని తాకిన సూర్యకిరణాలు

జలుమూరు: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగేశ్వరలో కొలువు తీరిన యముని విగ్రహాన్ని మంగళవారం సూర్య కిరణాలు తాకాయి. పలువురు భక్తులు వీక్షించి తరించారు. శ్రీముఖలింగేశ్వరుని ప్రధాన ఆలయం చుట్టూ అష్ట దిక్పాలకులు కొలువుదీరి ఉన్నారు. అందులో యముడు కూడా ఒకరు. చైత్రమాసం పౌర్ణమి రోజున ఉదయం యముని విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకడంతో పలువురు ఆనందం వ్యక్తంచేశారు.


యముని విగ్రహాన్ని తాకిన సూర్యకిరణాలు

వైసీపీ నుంచి పది కుటుంబాలు టీడీపీలో చేరిక

టెక్కలి: రావివలసకు చెందిన దాసరి అప్పారావుతో పది కుటుంబాలు మంగళవారం వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో వీరికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కండువాలు కప్పి ఆహ్వానించారు. గ్రామాల అభివృద్ధి అచ్చెన్నాయుడుతోనే సాధ్యమని గుర్తించి తాము టీడీపీలో చేరుతున్నట్లు అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ బడే జగదీష్, మాజీ ఎంపీటీసీ నర్సు కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ● **పలాస:** పట్టణంలోని 28వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు మంగళవారం టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు సమక్షంలో టీడీపీలో చేరారు. పాతాళ తారక, వెంకటేష్, జగన్, మల్లేసు, ఈశ్వరరావు, మల్లయ్య, జనార్దనలతో పాటు వార్డు ప్రజలకు కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, కె.సురేష్, జగదీష్ పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో అచ్చెన్నాయుడు

జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీకి 19 నామినేషన్లు

● పార్లమెంటు స్థానానికి 4..

కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం అసెంబ్లీ స్థానాలకు 19 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో శ్రీకాకుళం అసెంబ్లీకి పిరమిడ్ పార్టీ తరఫున కర్రి లక్ష్మణరావు, టెక్కలిలో కింజరాపు అచ్చెన్నాయుడు తరఫున ఆయన భార్య విజయమాధవి, బీఎస్పీ తరఫున నందిగాం మండలం దేవళభద్ర సర్పంచ్ చింతాడ శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. అలాగే శ్రీకాకుళం ఎంపీ స్థానానికి 4 నామినేషన్లు దాఖలయ్యాయి. జై భారత్ నేషనల్ పార్టీ తరఫున ఇప్పిలి సీతరాజు రెండో సెట్ పత్రాలను దాఖలు చేయగా, చెల్లూరి డానియేల్, సనపల శ్రావణ్‌కుమార్ ఇండిపెండెంట్‌గా వైసీపీ తరఫున పేరాడ తిలక్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలకు 68 మంది అభ్యర్థులు 95 నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

ఎంవీఐ కార్యాలయాన్ని తరలించచొద్దు

ఇచ్ఛాపురం: నియోజకవర్గ కేంద్రమైన ఇచ్ఛాపురంలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న ఎంవీఐ కార్యాలయాన్ని కంచిలికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, దీనిని ఇచ్ఛాపురంలోనే కొనసాగించాలని జిల్లా ప్రైవేట్ బస్ ఆపరేటర్స్ అసోసియేషన్ సభ్యులు కట్టా సూర్య ప్రకాష్ ఒక ప్రకటనలో కోరారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడి నుంచి సేవలందిస్తున్నారని, అకస్మాత్తుగా తరలించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. పునరాలోచించి తగు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని ఆయన పేర్కొన్నారు.







